క్లుప్తంగా

నేడు పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పుంగనూరు: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పట్టణంలో పర్యటిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న గృహసారథుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి గృహసారథులు, కన్వీనర్లు , ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఉదయం 9 గంటలకు పులిచెర్ల మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

సమష్టి కృషితోనే మండలం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలం అభివృద్ధికి సమష్టి కృషిగా చేద్దామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. వైస్ ఎంపీపీ రాశి, ఎంపీటీసీ సభ్యులు పోకల చంద్ర, మంజుల, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ఎంపీడీఓ సుగుణమ్మ, సర్పంచ్ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహాలు

రామకుప్పం: మండలంలోని కృష్ణరాజపురంలో బుధవారం నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అశ్వర్థ వృక్షాలకు కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా గణపతి, నవగ్రహ శాంతిహోమం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.


ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి




సంత్‌సేవాలాల్‌కు నివాళులర్పిస్తున్న బాణావత్ మునీంద్రనాయక్

పుంగనూరు: సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు మండలంలోని జేడీ తాండాలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

ఉర్దూ గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా కిజర్‌ఖాన్





చైర్మన్ కిజర్‌ఖాన్, ఉపాధ్యక్షుడు సుల్తాన్‌ఖాన్

పుంగనూరు: పట్టణంలోని ఉర్దూ గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా ఎండీ కిజర్‌ఖాన్ నియమితులైనట్లు గ్రంథాలయాధికారి నసీబ్ జాన్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా సుల్తాన్‌ఖాన్, ఇనాయతుల్లా, సభ్యులుగా కలంధర్, నకీవుల్లా, ఫయాజ్, వెంకటపతితో పాటు గ్రంథాలయాధికారితో కలసి కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

ప్రత్యేక బస్సు సర్వీసుల కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న పెద్దన్న తదితరులు

కుప్పం: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని కుప్పం నుంచి ప్రత్యేకంగా బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణ్‌రావుకు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం లక్ష్మణ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం, శ్రీ కాళహస్తి, గుడుపల్లె మండలంలోని మల్లప్ప కొండకు ప్రత్యేక సర్వీసులు నడపాలని కోరారు. పండుగ రోజున కుప్పంలోని భక్తులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.

శుభకార్యాలు.. విందు భోజనాలు.. పూజలు.. ఇలా భారతీయ సంస్కృతిలోని అన్ని మంచి కార్యక్రమాల్లో తమలపాకులకు విశిష్టస్థానం ఉంది. అయితే ఈ పంట సాగు విస్తీర్ణం రోజుకు తగ్గిపోతోంది. దీనికితోడు ప్రస్తుతం తీగలు దించే సీజన్ కావడంతో దిగుబడి తగ్గింది. దీంతో ధరలు నింగినంటుతున్నాయి. ఇలాగైతే మన నోరు పండేదెలా? అని తాంబూల ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నోరు పండేదెలా?

- ఆందోళనలో తాంబూలప్రియులు
- కట్ట ఆకులు రూ.200 పైమాటే
- క్రమేణ తగ్గుతున్న ఆకుతోటల సాగు

పలమనేరు: ఆలయాల్లో పూజల నుంచి శుభకార్యాల వరకు తమలపాకుల అవసరం ఉంది. ఇక తాంబూల ప్రియులకు రోజూ తమలపాకు ఉండాల్సిందే. దీంతో తమలపాకులకు ప్రస్తుతం భలే డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో తమలపాకు ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని దుకాణాల్లో కట్ట తమలపాకులు(వంద) ధర రూ.200 పైగా పలుకుతోంది. మార్చి వరకు తమలపాకు తోటల్లో తీగెలు దించే కాలం అయినందున డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని తమలపాకుల వ్యాపారులు చెబుతున్నారు. ఇలాగైతే తాంబూలం వేసినట్టేని తాంబూల ప్రియులకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగా తగ్గిన సాగు

జిల్లాలోని పటమటి ప్రాంతంలో తాంబూలం వేసే గ్రామీణుల సంఖ్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో చాలామందికి తాంబూలం వేయడం ఇప్పటికి అలవాటు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో గతంలో 600 మంది రైతుల వరకు తమలపాకు తోటలు సాగు చేసేవారు. కాలక్రమేణ సాగు తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం తమలపాకు తోటలు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో శాంతిపురం, కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల్లో వంద మంది మాత్రమే సాగు చేస్తున్నారు. ఒక్కసారి తమలపాకు తోటలను సాగు చేస్తే 30 ఏళ్ల పాటు ఆ పంట ఉంటుంది. అయితే వీటి నిర్వహణకు ప్రత్యేకంగా మనుషులుండాల్సిందే. పాతతరంనాటి వారు ఉన్నప్పుడు వీటిని సాగుచేసేవారు. నేటితరంలో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఉన్న తోటల్లోనూ ఈ సీజన్‌లో తీగెలను దించే సమయం ఇది. దీంతో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తులు లేవు. ఈ క్రమంలో తమలపాకుల ధరలు నింగినంటుతున్నాయి.

కర్ణాటక నుంచి దిగుమతి

కర్ణాటకలోని తుంకూరు ప్రాంతం నుంచి ఇక్కడికి తమలపాకులు ఎక్కువగా దిగుబడి చేసుకుంటున్నారు. అయితే ఇవి లోకల్ తోటల్లోని నాటు రకాలు కావు. కాస్త హైబ్రీడ్‌గా పండించే తమలపాకులను తుంకూరు జిల్లా రైతులు పండిస్తుంటారు. స్థానికంగా సరుకు లేనందువల్ల అక్కడి నుంచి వస్తున్న ఆకులకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా తమలపాకు ధర ఆకాశాన్నంటుతోంది.

పదేళ్ల వయసు నుంచి తాంబూలం వేస్తున్నా..



నాకు పదేళ్ల వయసు నుంచి వక్కాకు వేస్తున్నా. ఇపుడు నా వయసు 70 ఏళ్లు. వదలాలంటే బుద్ధి పుట్టదు. అలవాటు చేసుకున్నాం కాబట్టి తమలపాకు రేటు ఎక్కువైనా కొనాల్సిందే. నాకు తెలిసి కట్ట తమలపాకులు రూ.3 గా ఉండేది. ఇప్పుడు రూ. 200 దాటాయి. అయినా కొనాల్సిందే తాంబూలం వేయాల్సిందే.

– రత్నక్క, కొలమాసనపల్లె

లోకల్ తమలపాకులు రావడం లేదు



నేను 20 ఏళ్లుగా వారపు సంతలో దుకాణాన్ని పెట్టి వ్యాపారం చేస్తున్నా. సాధారణంగా స్థానికంగా ఉండే ఆకు తోటల నుంచే మాకు తమలపాకులు అందేవి. ఇప్పుడు అన్‌సీజన్ అయినందున తమలపాకు ధరలు పెరిగాయి. తుంకూరు నుంచి తమలపాకులు ఇక్కడికి వస్తున్నాయి. దీంతో వాళ్లు చెప్పిన ధరలకు కొనాల్సివస్తోంది.

– శివప్పస్వామి, వ్యాపారి, బైరెడ్డిపల్లి

గృహసారథులు..వలంటీర్లు సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల: ప్రభుత్వ పథకాలను పేదలకు అందించేందుకు గృహసారథులతో వలంటీర్లు కలసి పనిచేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అన్నారు. ఆయన బుధవారం రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె సచివాలయాల్లో జరిగిన గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పార్టీలకతీతంగా జరగాలన్నారు. ఎక్కడ వివక్ష చూపకూడదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మండల గృహసారథుల కన్వీనర్ కరీముల్లా, కార్యదర్శులు నాగరాజ, హరిబాబు, రవిచంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటా వెంకటరమణ, చిన్న నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంటకూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

గంగవరం: రైతులు సాగు చేసే ప్రతి పంటకూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాల్సిన బాధ్యత ఆర్బీకే సిబ్బందిపై ఉందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా ఆదేశించారు. మండలంలోని తాళ్లపల్లె రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్బీకే సిబ్బందితో సమావేశమయ్యారు. పంట నమోదు కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో పూర్తి చేసి, ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున ప్రతి ఆర్బీకే పరిధిలో చిరుధాన్యాలు సాగు పెంచాలని, రాగులు, సామలు, ఆరికలు, కొర్రలు, తదితర పంటలు సాగు చేయించాలని సూచించారు. ఆర్బీకేలో ఎరువుల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం గంగవరం పీఏసీఎస్‌లో ఎరువుల అమ్మకాలను పరిశీలించారు. తరువాత కల్లుపల్లెలో సూపర్ చెక్ ద్వారా రైతులు పండించిన వరి పంటను పరిశీలించారు. ఏడీఏ మధుసూదన్, ఏఓ హేమలత పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్ తదితరులు

చౌడేపల్లె: ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు జరిగేలా చూడాలన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన కొత్త పనులను గుర్తించాలన్నారు. పండ్ల తోటల పెంపకం పనులపై దృష్టి సారించాలని, భూగర్భ జలాలను పెంచడం, నీటి నిల్వ పనులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గృహ నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఉపాధి నిధులను దశలవారీగా పనుల స్థాయి ఆధారంగా 90 పనిదినాలను కల్పించి ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. ప్రతి జాబ్ కార్డులో ఉన్న కూలీలందరూ విధిగా బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్‌ను ఎన్‌పీసీఐలో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీనివాస్ యాదవ్, జేఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, సయ్యద్‌బాషా, సీఓలు ప్రసాద్, భరత్ పాల్గొన్నారు.

బోయకొండలో కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



ప్రమీలా నాయుడికి స్వాగతం పలుకుతున్న చైర్మన్ శంకర్ నారాయణ తదితరులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రమీలానాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఆలయాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. ఆలయ విశిష్టతను, చరిత్రను అర్చకులు వివరించారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి, ఆలయ మాజీ పాలక మండలి సభ్యుడు రాయల్ మోహన్, ఐసీడీఎస్ సీడీపీఓ సరళాదేవి, సూపర్‌వైజర్ సులోచన ఉన్నారు.

నేటి నుంచి ఆవుల పబ్బం

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన, గడ్డంవారిపల్లె, ఆమినిగుంట పంచాయతీల్లో గురువారం నుంచి రెండు రోజులపాటు వైభవంగా ఆవుల పబ్బం పండుగను జరుపుకోనున్నారు. పరికిదొన, సింగిరిగుంట, నుంజార్లపల్లె, నూనెముద్దనపల్లె, ప్యారావాండ్లపల్లె, సామిరెడ్డిపల్లె, దొనపల్లె, మొరుంకిందపల్లె, ఎగువ, దిగువ మల్లెలవారిపల్లె, గడ్డంవారిపల్లె, చౌడగానిపల్లె మొత్తం 12 గ్రామాలకు చెందిన ప్రజలు ఏటా కనుల పండువగా ఆవుల పబ్బం నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. పరికిదొన సమీపంలోని నాగప్పచెరువులో అన్నిగ్రామాలకు చెందిన పశువులు ఒకచోటకు చేర్చి, కాటమరాజు ఆలయానికి మహిళలు దీవెలతో వెళ్లి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు.

పాఠశాలను సందర్శించిన జిల్లా కోఆర్డినేటర్

పలమనేరు: పట్టణంలోని నార్త్ పాఠశాలను టీఏఆర్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ లోకనాథం బుధవారం సందర్శించారు. ప్రాథమిక దశలో పిల్లల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. ఇందుకు సంబంధించి గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి పాల్గొన్నారు.

మొగిలికి ప్రత్యేక సర్వీసులు

పలమనేరు: మొగిలి ఆలయానికి ఈనెల 18వ తేదీ శివరాత్రి సందర్భంగా పలమనేరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం నుంచి, పలమనేరు బస్టాండ్ నుంచి పలు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెడ్పీ హైస్కూల్ స్థలం సర్వే

రామకుప్పం: స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేళ్ల జయప్ప ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు సుమారు 10 సెంట్ల భూమి పాఠశాలకు చెందినదిగా ధ్రువీకరించారు. అయితే సర్వే చేసిన స్థలం రస్తాపోరంబోకు అని ఆ దారి పాఠశాలకు, రోడ్డుకు మధ్య ఉన్న స్థలమని పక్కన ఉన్న భూ యజమానులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల మేరకు సర్వే నిర్వహించిన స్థలం జెడ్పీ హైస్కూల్‌కు చెందినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణ, విలేజ్ సర్వేయర్ గోపి, వీఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

శాంతిపురం: కర్లగట్ట పంచాయతీలోని వెంకటాపురంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఉదయం 9 నుంచి ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

17 నుంచి భోగనంజుండేశ్వర స్వామి ఉత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని భోగనంజుండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 17 తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ కమలాకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 17వ తేదీ ఉదయం గంగపూజతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. శివరాత్రి పర్వదినం రోజున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకారం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, మహానైవేద్యం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రూపు టెంపుల్స్ జూనియర్ అసిస్టెంట్ వెంకట్రమణ, అర్చకులు పాల్గొన్నారు.

మూడోవార్డు కన్వీనర్‌గా ప్రభాకర్



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు సచివాలయం కన్వీనర్‌గా నియమితులైన ప్రభాకర్‌కు ఎమ్మెల్సీ భరత్ నియామకపత్రం అందజేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయం వైఎస్సార్ సీపీ మూడోవార్డు కన్వీనర్‌గా బాబునగర్‌కు చెందిన ప్రభాకర్ నియమించారు. తనను కన్వీనర్‌గా నియమించినందుకు ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లాడ్జిపై దాడులు.. నలుగురి అరెస్టు

గుడుపల్లె: మండల కేంద్రంలోని లాడ్జిపై దాడులు చేసి, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి అమ్మాయిలను తీసుకుని వచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేశామని గుడుపల్లె పోలీసులు తెలిపారు. గుడుపల్లె ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు.. కుప్పం సమీపంలోని గుడుపల్లె రోడ్డులో గుండ్లసాగరం క్రాస్ వద్ద ఉన్న శ్రీనివాసులకు సంబంధించిన వరద లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రామాంజనేయులు తన సిబ్బందితో కలసి వరద లాడ్జిపై దాడులు చేశారు. లాడ్జిలో పనిచేస్తున్న రాజశేఖర్, మురుగేష్ ద్వారా తమిళనాడు రాష్ట్రం వరటనపల్లె గ్రామం చెందిన వడివేలును అదుపులో తీసుకున్నారు. అలాగే లాడ్జిలో ఉన్న విటుడు బాలాజీని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు గృహసారథుల సమావేశం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం నూతనంగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొననున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బోయకొండకు రూ.1.70 కోట్లు ఆదాయం



మాట్లాడుతున్న చైర్మన్ శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల నిర్వహణ లీజు కోసం ఏడాది గడువు ఇస్తూ జరిగిన వేలం పాటల ద్వారా రూ.1.70 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ తెలిపారు. బుధవారం ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో 9 హక్కులు పొందే లీజు కోసం వేలం పాటలను నిర్వహించారు. వేలంలో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి 40 మంది హాజరయ్యారు. ఒక్కొక్కరు రూ.5 లక్షలు ధరావత్తు చెల్లించి, వేలం పాటల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉత్కంఠ భరితంగా పోటాపోటీల మధ్య వేలం పాటలు జరిగాయి. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయించుకునే హక్కు ద్వారా రూ.30.20 లక్షలు హెచ్చుపాట పాడి, గంగాపురం గ్రామానికి చెందిన నవీన్ సొంతం చేసుకున్నాడు. పూల హారాలు, నిమ్మకాయల హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కు వేలంలో రూ.35.01 లక్షలతో హెచ్చుపాట పాడి, భవానీనగర్‌కు చెందిన రఘుపతినాయుడు కైవసం చేసుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికలు సేకరించే హక్కుకు జరిగిన వేలంలో రూ.18.04 లక్షల హెచ్చుపాట పాడి అప్పినేపల్లెకు చెందిన లలితమ్మ కైవసం చేసుకుంది. అలాగే పెద్దభోగం, చిన్నభోగం శుభ్రపరిచి ఇచ్చే హక్కుకు నిర్వహించిన వేలంలో రూ.50.01 లక్షలతో అత్యధిక పాట పాడి బోయకొండ గంగాపురం గ్రామానికి చెందిన డిష్ సూరి సొంతం చేసుకున్నారు. కోళ్లను విక్రయించుకును హక్కుకు నిర్వహించిన వేలంలో రూ.23.01 లక్షల హెచ్చుపాట పాడి భవానీనగర్‌కు చెందిన లడ్డూ రమణ సొంతం చేసుకున్నారు. కాగా గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.77.44 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు వెంకటరమణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, పాలకమండలి మాజీ సభ్యుడు రాయల్ మోహన్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన వేలం పాటలు

ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలంలో సరైన మద్దతు ధర రాకపోవడంతో వేలం పాటలను వాయిదా వేసినట్లు ఈఓ చంద్రమౌళి ప్రకటించారు. దేవస్థానం, పంచాయతీకి చెందిన టోల్ వసూలు, తలనీలాలు, పెద్ద భోగం, చిన్న భోగం, కొబ్బరి చిప్పల సేకరణ హక్కులపై నిర్వహించిన వేలం పాటలు వాయిదా వేశారు. తిరిగి వేలం నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని ఈఓ పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న భరత్

రామకుప్పం: మండలంలోని విజలాపురం పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. అందులో భాగంగా పంచాయతీలోని బాలఓబనపల్లెలో రూ.12.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటించాలని సూచించారు. మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు భరత్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మి

వి.కోట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వార్డు సభ్యులు ఎప్పటికప్పుడు గుర్తించి పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ముందడుగు వేయాలని సర్పంచ్ పీఎస్ లక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక సచివాలయంలో ఆమె పంచాయతీ వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం ప్రభావితం ప్రారంభమైందని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలున్న ప్రదేశాలను గుర్తించి అధికారులకు తెలపాలన్నారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఈఓ యాదవపతి, వార్డు సభ్యులు కుమార్‌రాజు, మంజుల, విజయమ్మ, మోహన్‌రాజు, రఫీ, ఖాదర్‌మొహీరా, జమున, నాగరత్నం, వాణాలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

వి.కోట: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ మొగిలేశ్వరన్ సూచించారు. బుధవారం మండలంలోని చింతమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పర్యటించి పిల్లలను బడికి రప్పించే దిశగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులు, యువతతో మాట్లాడుతూ నేటి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది యువరాజు, ఉపాధ్యాయుడు రమేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

పలమనేరు: పట్టణంలోని సరస్వతి కేఫ్ ఎదురుగా గురువారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన బలిజ సంఘం నాయకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక బలిజ సంఘ నేతలతో కలసి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. బలిజసంఘ నేతలు సుధాకర్, బాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికవ్యవస్థను నిర్మూలిద్దాం



పలమనేరు: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, ఆ బాధ్యత నేటి సమాజంపై ఉందని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టు హాలులో బుధవారం ఆయన మాట్లాడుతూ పలు కారణాలతో బాల కార్మికులు పుట్టుకొస్తున్నారని తెలిపారు. వీరిని బడిలో చేర్పించి, మంచి భవిష్యత్ ఇప్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా, సమాజం బాధ్యత కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కుప్పస్వామి, లక్ష్మీపతి, ఎల్ భాస్కర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వితరణ



శ్రీకాళహస్తి ఆలయానికి కూరగాయలను పంపిన శ్రీవారి సేవకులు

పలమనేరు: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యాన్నదాన పథకానికి స్థానిక శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు కేఆర్ కూరగాయల మార్కెట్ నుంచి పది టన్నుల కూరగాయలను బుధవారం వితరణగా శ్రీకాళహస్తికి పంపించారు. అక్కడి ఆలయ నిర్వాహకుల ఆదేశాల మేరకు ఈ కూరగాయలను పంపినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

టెర్రకోట హస్తకళాకారుడు మృతి



రెడ్డెప్ప(ఫైల్)

పలమనేరు: పట్టణంలోని గంటావూరు టెర్రకోట హస్తకళాకారుడు రెడ్డెప్ప బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. హస్తకళాకారులు తయారు చేసిన శిలాకృతలకు పెయింటింగ్ వేయడంలో సిద్ధహస్తుడైన రెడ్డెప్ప ఈ ప్రాంతంలో చాలా సుపరిచితులు. గతంలో గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్న ఆయన మళ్లీ అదే సమస్యతో మృతి చెందారు. ఇతని మృతికి టెర్రకోట హస్తకళాకారులు సంఘం నేతలు రామకృష్ణ, మోహన్, మాజీ ఎంపీపీ రాజేంద్రన్ తదితరులు సంతాపం తెలిపారు.

మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభు మొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారి మూల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం అలంకార మండపంలో సర్వవిఘ్నాధిపతి వినాయకస్వామి ఉత్సవమూర్తికి విశేషాలంకరణ అలంకరించారు. అనంతరం స్వామివారిని మూషిక వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. మూషిక వాహన ఉత్సవానికి బంగారుపాళేనికి చెందిన సరస్వతి, సుధాకర్ నాయుడు ఉభయకర్తలుగా వ్యవహరించారు.